ఈ నెల 14న రెజ్లింగ్ ఎంపికలు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 11 : ఉమ్మడి వరంగల్ జిల్లా 19 సంవత్సరాల లోపు బాలుర రెజ్లింగ్ ఎంపికలు ఈ నెల 14న నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా క్రీడలు, యువజన శాఖాధికారి, కాలేజీల క్రీడా సమాఖ్య కార్యదర్శి గుగులోత్ అశోక్‌కుమార్ తెలిపారు. హనుమకొండ జేఎన్ఎస్‌లో ఉదయం 10 గంటలకు జరిగే ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ పుట్టిన తేదీ, స్టడీ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. పోటీలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను ఈ నెల 15 నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు పీఈటీ తోట శ్యాంప్రసాద్ 98492 10746 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గురుకుల విద్యార్థులకు కార్పొరేట్ విద్య

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

పరకాల, అక్టోబర్ 11: గురుకుల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, ఇందులో భాగంగా నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రారంభించనున్నట్లు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పట్టణ విలీన గ్రామమైన రాజీపేట శివారులో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ప్రభుత్వ భూమిని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే చేసి, హద్దులు నిర్ణయించాలని అధికారులను ఆదేశించారు. కాగా, పరకాల నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ గురుకుల స్కూల్‌ను మంజూరు చేసిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

ఖిలావరంగల్, అక్టోబర్ 11: అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందిన ఘటన గురువారం అర్ధరాత్రి ఖిలావరంగల్ పడమరకోటలో జరిగింది. మృతుడి బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. శివనగర్ భూపేశ్‌నగర్‌కు చెందిన ఎండీ హుస్సేన్, పడమరకోటకు చెందిన రాణి 15 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకొని కోటలో నివాసముంటున్నారు. గురువారం రాత్రి సద్దుల బతుకమ్మను వీక్షించి ఇంటికి వెళ్తున్న క్రమంలో హుస్సేన్ తన స్నేహితుడైన శివ ఇంటికి వెళ్లాడు. అప్పటికే మద్యం తాగి ఉన్న హుస్సేన్ రక్తం కక్కుకొని మృతి చెందాడు. కాగా, తన భర్త మృతిపై అనుమానం ఉందని రాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

తలకు తీవ్ర గాయాలతో వృద్ధుడు..

గిర్మాజీపేట : తలకు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందినట్లు ఇంతెజార్‌గంజ్ సీఐ షుకూర్ తెలిపారు. గిర్మాజీపేటకు చెందిన మహ్మద్ జిలాని(60) ఈ నెల 8న తన ఇంట్లో మంచం పైనుంచి పడిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానాకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. మృతుడి కుమారుడు యాకూబ్‌పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో గీసుగొండ టీఏ..

గీసుగొండ: అనారోగ్యంతో టీఏ మృతి చెందిన ఘటన గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్లలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన కూనమల్ల ఓంకార్(46) మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో టీఏగా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొంత కాలంగా అతడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రెండు రోజుల క్రితం హనుమకొండలోని ఓ ప్రైవేటు దవాఖానలో చేర్పించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. అడిషనల్ డీఆర్డీవో రేణుక, ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు బాధిత కుటుంబానికి రూ. 20 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో ప్రభాకర్, ఈజీఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రావు పాల్గొన్నారు.

హెచ్చరిక

ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా నా క్లయింట్ అగు రావుల భూపాల్‌రెడ్డికి సంబంధించిన సర్వే నెం. 280/C, మడికొండ రెవెన్యూ శివారులలో గల దానిలో వాల్మికి బోయ సంగం మడికొండ వారు నా యొక్క క్లయింట్ స్వంత భూమిలో వారు వాల్మికి సంబంధించిన దేవుని షెడ్ నిర్మించుటకు ప్రయత్నము చేయుచున్నారు. అట్టిదానిపై కోర్టులో కేసు కూడా వున్నది. అట్టిదానా నెం. 350/2024 నాలుగవ అదనపు మున్సిఫ్ కోర్టు హన్మకొండలో కలదు. ఒకవేళ మీరు నిర్మించిన చట్టప్రకారము మీపై చర్యలు తీసుకొని కూలగొట్టడం జరుగుతుంది. అదేవిధముగా ఎవరు నా క్లయింట్ భూమిపై వచ్చిన చట్టప్రకారము చర్యలు తీసుకోబడును.
తేది. 11-10-2024
ఇట్లు
రావులశ్రీనివాస్‌రెడ్డి,
రావులవాణి
అడ్వకేట్స్, ఇ.నెం. 1-7-245, రెవెన్యూ కాలనీ, హనుమకొండ జిల్లా. సెల్: 9849251196

హనుమకొండ చౌరస్తా : వేయిస్తంభాల గుడిలో రుద్రేశ్వరదేవికి పూజలు చేస్తున్న బండా ప్రకాశ్

భీమదేవరపల్లి: కొత్తపల్లిలో పూజలు చేస్తున్న ప్రవీణ్‌రెడ్డి

దామెర : మండల కేంద్రంలో కనకదుర్గ అమ్మవారికి పూజలు చేస్తున్న పిల్లల వైద్య నిపుణులు

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- తొమ్మిదో రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు
- పలు చోట్ల పాల్గొన్న ప్రజాప్రతినిధులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 11: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తొమ్మిదో రోజు శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో రుద్రేశ్వరీదేవికి పూజలు చేసి, మహిషాసురమర్ధినిగా అలంకరించారు. అమ్మవారు త్రిశూలధారిణితో దర్శనమిచ్చారు. రాష్ట్ర శాసనమండలి వైస్‌చైర్మన్ బండా ప్రకాశ్ పాల్గొని పూజలు చేసి, వాహనసేవ నిర్వర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయంలో గార్డెన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, సౌండ్స్ అండ్ లైట్స్ కూడా ఏర్పాటు చేయాలని కేంద్రపురావస్తుశాఖ జిల్లా అధికారి మల్లేశంకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వంతో కూడా చర్చిస్తామని తెలిపారు. 9 రోజులుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. సాయంత్రం నృత్యభారత్ కళాఫౌండేషన్ వారిచే కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు. తౌటిరెడ్డి రవీందర్‌రెడ్డి, వడ్నాల నరేందర్, గాయత్రిదేవి, ఇందిరాదేవి, అరవంద్, హర్షవర్ధన్, సతీశ్, పల్లం రమేశ్, కోన శ్రీకర్, పులి రజనీకాంత్ సేవలందించారు. ఈవో వెంకటయ్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భీమదేవరపల్లి: సతీసమేతంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్

ఐనవోలు: సిద్ధిధాత్రి అలంకరణలో భ్రమరాంబికాదేవి

కాజీపేట : వేంకటేశ్వర కాలనీలో అమెరికన్ డాలర్లతో అలంకరించిన దుర్గామాత

'సిద్ధిధాత్రి'అలంకరణలో భ్రమరాంబికాదేవి

ఐనవోలు : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐనవోలు భ్రమరాంబికాదేవి 'సిద్ధిధాత్రి' అలకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉప ప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, శ్రీనివాస్‌శర్మ, వేదపండితుడు విక్రాంత్ వినాయక్ జోషి, ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, అర్చకులు నరేశ్‌శర్మ, భానుప్రసాద్‌శర్మ, మధుశర్మ, శ్రీనివాస్, దేవేందర్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే పూజలు

భీమదేవరపల్లి : హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ ఆకాంక్షించారు. మూడు రోజులుగా హనుమకొండ హంటర్ రోడ్డులోని ఆయన నివాసంలో జరుగుతున్న అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మి కాంతారావు, కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో కొలువుదీరిన దుర్గా మాతను మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

కాజీపేటలో అమ్మవారికి డాలర్లతో అలంకరణ

కాజీపేట : గ్రేటర్ 62వ డివిజన్ పరిధి రహమత్‌నగర్‌లోని వేంకటేశ్వర కాలనీలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాతను భక్తులు 200 అమెరికన్ డాలర్లతో అలంకరించారు. పాక రాజయ్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో దుర్గామాతకు సంతోష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీకి చెందిన భక్తులు అమెరికాకు చెందిన రెండు వందల డాలర్లతోపాటు రూ.1.50లక్షల విలువ చేసే ఇండియన్ కరెన్సీతో అమ్మవారికి దండలు వేశారు. కార్యక్రమంలో పాక వేద ప్రకాశ్, పాము రాజేశ్‌కుమార్, సాయి ప్రకాశ్, రాజిరెడ్డి, విజయ్ ప్రకాశ్ పాల్గొన్నారు.

దామెరలో వైద్యుల పూజలు

దామెర : మండల కేంద్రంలో దుర్గామాత ఉత్సవాలను పురస్కరించుకుని కనకదుర్గ అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ మల్లాడి శ్రీరాంరెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండకు చెందిన పది మంది పిల్లల వైద్యనిపుణులు దామేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 18,19, 20వ తేదీల్లో వరంగల్‌లో రాష్ట్ర స్థాయి టీజీ పెడికాన్-2024 సదస్సును విజయవంతం చేయడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డాక్టర్ శ్రీరాం రెడ్డి తెలిపారు.

బాత్‌రూం క్లీనర్ తాగి వృద్ధురాలి ఆత్మహత్య

ఆత్మకూరు, అక్టోబర్ 11 : మండల కేంద్రానికి చెందిన దూలం సమక్క (83) బాత్‌రూం క్లీనర్ తాగి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ సంతోశ్‌కుమార్ తెలిపారు. కొనేళ్లుగా సమ్మక్క అనారోగ్యంతో బాధపడుతూ ఉండేదని, కొన్ని నెలలుగా మూత్రం సరిగా రాక పోవడంతో వల్ల ఇబ్బందులు పడుతూ ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉన్న బాత్‌రూం క్లీనర్‌ను కూల్‌డ్రింక్‌లో కలుపుకుని తాగిందని తెలిపారు. స్పృహ కోల్పోయిన ఆమెను వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. సమ్మక్క కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

దాడి చేసిన వారిపై కేసు

హసన్‌పర్తి, అక్టోబర్ 11 : వ్యక్తిపై దాడి చేసిన వారిపై కేసు నమోదైంది. సీఐ చేరాలు కథనం ప్రకారం.. ఎల్కతుర్తి మండలం బావుపేటకు చెందిన బత్తిని ప్రదీప్ ఈ నెల 6న సాయంత్రం బావుపేట క్రాస్ వద్ద ఉన్న రమేశ్ హోటల్‌లో తన స్నేహితుడు తాడూరి హరికృష్ణతో కలిసి వేరే మిత్రుల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న బల్లపై ప్రదీప్ పడుకున్నాడు. ఇంతలో హనుమకొండకు చెందిన శ్రీపతి శ్రీకాంత్, ఎడెల్లి సందీప్‌రెడ్డి ఆ హోటల్‌కు వచ్చారు. అక్కడ బల్లపై పడుకున్న ప్రదీప్‌ను తిడుతూ లేపారు. దీంతో ఎందుకు తిడుతున్నావని ప్రదీప్ ప్రశ్నించడంతో వారు అక్కడ ఉన్న కర్ర, బీరుసీసాలతో దాడి చేశారు. దీంతో బాధితుడు ప్రదీప్ శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గొడవలు చేస్తే కఠిన చర్యలు

దామెర, అక్టోబర్ 11 : మండలంలో జరిగే దసరా వేడుకల్లో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎస్సై కొంక అశోక్ సూచించారు. గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడేవారితోపాటు, డీజేలను వినియోగించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పండుగ నేపథ్యంలో ప్రత్యేక అధికారులు, పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. దుర్గాదేవి శోభాయాత్రలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఏదైనా గొడవలు జరిగితే డయల్ 100కు లేదా 8712685228, 88971 57403 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

'వెంకటేశ్‌ను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలి'

ఎల్కతుర్తి, అక్టోబర్ 11 : పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న శనిగరం వెంకటేశ్‌ను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలని పలువురు నాయకులు శుక్రవారం మండలాధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డికి ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా వెంకటేశ్ పార్టీ అధ్యక్షుడు, మంత్రి అభిమానులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడని ఆరోపించారు. ఈ మేరకు సీనియర్ నాయకులకు కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

జిల్లా ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు

ఎంపీ డాక్టర్ కడియ కావ్య

కలెక్టర్ పీ ప్రావీణ్య

మేయర్ గుండు సుధారాణి

హనుమకొండ/వరంగల్, అక్టోబర్ 11 : హనుమకొండ జిల్లా ప్రజలకు పలువురు ప్రముఖులు శుక్రవారం దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమిని ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య, హనుమకొండ కలెక్టర్ పీ ప్రావీణ్య, గ్రేటర్ మేయర్ గుండు సుధారాణి వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఈ దసరా పండుగను ప్రజలంతా ఐకమత్యంతో జరుపుకోవాలని కోరారు. అందరూ సుఖ సంతోషాలతో ఉండేలా ఆ దుర్గాదేవి ఆశీర్వదించాలని ఆకాంక్షించారు. జగన్మాత ఆశీస్సులతో ప్రతి కుటుంబం సిరి సంపదలు, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని అభిలాషించారు. చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకొనే పండుగ విజయదశమి అని పేర్కొన్నారు.

'సివిల్ డ్రెస్' ఖాకీ సెటిల్‌మెంట్లు!

- హెడ్ కానిస్టేబుల్ రూటే సప'రేటు'
- సెంట్రల్ జోన్ పరిధి ఠాణాలో ఇష్టారాజ్యం
- కొత్త బాస్ రావడంతో వ్యవహారాలు వెలుగులోకి..

సుబేదారి, అక్టోబర్ 11 : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధి సెంట్రల్ జోన్‌లోని ఓ ఠాణాలో కొంత కాలంగా పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ రూటే సప'రేటు'గా మారింది. ఆయనకు ఖాకీ డ్రెస్ అంటే నచ్చదు.. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన ఓ అధికారి సపోర్ట్‌తో ఖాకీ డ్రెస్‌లో కాకుండా సివిల్ డ్రెస్‌లోనే డ్యూటీకి వచ్చేవాడు. స్టేషన్ బాస్ చెప్పినట్లే అన్ని వ్యవహారాలు చక్కదిద్దేవాడని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఆ స్టేషన్ అధికారి బదిలీ కావడంతో ఆ హెడ్ కానిస్టేబుల్ వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆ స్టేషన్‌లో పనిచేసే పోలీసు సిబ్బంది అందరూ ఖాకీ డ్రెస్‌లో వచ్చి వారి పని వారు చేసుకుంటే, అతడు మాత్రం లేటుగా లేటెస్ట్‌గా సివిల్ డ్రెస్‌లో వచ్చి, స్టేషన్ బాస్‌కు నమస్తే పెట్టి.. ఆయన ఆర్డర్స్ ప్రకారం సివిల్ 'డ్రెస్' సెటిల్‌మెంట్స్ చేసేవాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టేషన్‌కు వచ్చే ప్రతి పిటిషన్ కూడా ఆయన పరిశీలించిన తర్వాత పాత బాస్ టేబుల్ మీదికి వెళ్లేదని ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదుదారులతో సప 'రేటు' మాట్లాడుకొని తన వాటా తీసుకుంటూ, బందోబస్తు డ్యూటీ చేయకుండా స్టేషన్‌లోనే ఉంటూ సెటిల్‌మెంట్ల డ్యూటీ చేసేవాడని విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు ఠాణాకు కొత్తగా వచ్చిన ఎస్‌హెచ్‌వో ఆ హెడ్ కానిస్టేబుల్ సివిల్ 'డ్రెస్' సెటిల్‌మెంట్స్ డ్యూటీపై దృష్టిపెట్టాలని అక్కడ పనిచేస్తున్న పోలీసు సిబ్బంది చర్చించుకోవడం కనిపించింది. కొత్త సార్ రాకతో అతడి సివిల్ డ్రెస్ మారి, ఖాకీ డ్రెస్ వస్తుందా? లేక మళ్లీ అలానే సివిల్ డ్రెస్ డ్యూటీ హవా కొనసాగుతుందా? వేచిచూడాలి.

ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు

కాశీబుగ్గ, అక్టోబర్ 11: వరంగల్ 18వ డివిజన్ లేబర్ కాలనీ సమీపంలోని కట్టమల్లన్న చెరువు సమీపంలో ఉషోదయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి కృష్ణవేణి, వాసవి, రెండో బహుమతి రవళి, పద్మ, మూడో బహుమతి రిచిత, చిలువేరు పద్మ గెలుచుకున్నారు. మొదటి బహుమతిగా గోల్డ్ కాయిన్(గ్రాము), ద్వితీయ బహుమతి వెండి దీపం కుందులు, తృతీయ బహుమతిగా హోం నీడ్స్, మరో 30 ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో ఉత్కంఠకు తెర

- ఎట్టకేలకు బదిలీ ఉత్తర్వులు జారీ
- 15లోగా విధుల్లో చేరాలి

హనుమకొండ, అక్టోబర్ 11 : విద్యుత్ శాఖలో ఉత్కంఠకు తెరపడింది. బదిలీ ఉత్తర్వుల విషయంలో ఎట్టకేలకు యాజమాన్యం శుక్రవారం రాత్రి జారీ చేసింది. దీంతో ఇప్పటి వరకు ఉన్న అపోహలు, అనుమానాలకు తెర దించినట్లయింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 7న బదిలీ ఉత్తర్వులు జారీ చేసి 9లోగా ఉద్యోగులు విధుల్లో చేరాల్సి ఉంది. కానీ, బదిలీ ఉత్తర్వులకు అన్ని సిద్ధం చేసిన నేపథ్యంలో హోల్డ్‌లో పెట్టాలని మౌఖిక ఆదేశాలు రావడంతో ఉత్తర్వుల జారీ నిలిచిపోయింది. ఈ క్రమంలో వారం రోజులుగా బదిలీలపై వివిధ రకాల అనుమానాలు, అపోహలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. కొందరు ఉద్యోగులు ఈ విషయంలో అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంలో టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సైతం సంబంధిత సర్కిల్, డివిజన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. బదిలీల విషయంలో ఎలాంటి అపోహలు, అనుమానాలకు తావులేదని, నిబంధనల మేరకు మాత్రమే బదిలీలు జరుగుతాయని, అందుకు తగినట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో టీజీఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 జిల్లాలో, సర్కిల్, డివిజన్ పరిధిలో సంబంధిత అధికారులు బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 15వ తేదీలోగా విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, టీజీ ఎన్పీడీసీఎస్ పరిధిలోని 16 జిల్లాల్లో డీఈ, ఏడీ, సివిల్ ఏడీఈ, ఏఈలు కలిపి 386 మంది, అకౌంట్స్ విభాగంలో ఎస్ ఏవో, ఏఏవో, ఏవోలు 68 మంది, జేఏవోలు 8 మంది, అసిస్టెంట్ సెక్రటరీలు 27 మంది, సబ్ ఇంజినీర్లు ముగ్గురు, సీనియర్ అసిస్టెంట్లు ముగ్గురిని బదిలీ చేశారు. అలాగే, హనుమకొండ సర్కిల్ పరిధిలో వివిధ విభాగాల్లో కలిపి 137 మందితో పాటు డివిజన్ల పరిధిలో ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటులో నిర్లక్ష్యం

ఆత్మకూరు, అక్టోబర్ 11 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి మండలానికి ఒక ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయాలని సూచించినా అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆత్మకూరు మండలంలో నీరుగారి పోతున్నదని మహిళలు ఆరోపిస్తున్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ ఏర్పాటు కోసం రెండు నెలల క్రితం ఆత్మకూరు బస్టాండ్‌లోని షట్టర్లను మండల ప్రత్యేక అధికారి రాజేందర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం లలితా దేవితో కలిసి పరిశీలించారు. కానీ, ఇప్పటి వరరై క్యాంటీన్ విషయాన్ని మరిచిపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పోచమ్మకుంట పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్ నాయక్

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్ నాయక్

వరంగల్, అక్టోబర్ 11 : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అందుకు డాక్టర్లు, సిబ్బంది నిబద్ధతతో పని చేయాలని ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్ నాయక్ సూచించారు. శుక్రవారం ఆయన డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవీతో కలిసి పోచమ్మకుంట పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలు, జ్వర సర్వే, డెంగ్యూ, మలేరియా జ్వరాల నమోదు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికివాడలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఇంటింటా సర్వేలో భాగంగా వారికి సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్‌మోహన్‌రావు, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి ఇఫ్తాకర్ అహ్మద్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ హరిత పాల్గొన్నారు.

ఎన్నికైన గ్రామ అభివృద్ధి కమిటీ ఇదే..

గట్లకానిపర్తి అభివృద్ధి కమిటీ ఎన్నిక

శాయంపేట, అక్టోబర్ 11 : మండలంలోని గట్లకానిపర్తి గ్రామ అభివృద్ధి కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. గ్రామస్తులంతా కూడలిలో సమావేశం నిర్వహించి, 38 మందితో కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. కమిటీ కన్వీనర్లుగా బొమ్మకంటి ముత్యాలు, బొమ్మకంటి నాగరాజు, పెద్దిరెడ్డి సుభాష్ రెడ్డి, సముద్రాల లింగమూర్తి, నరెడ్ల రాంబాబును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి వైకుంఠ రథంతోపాటు సీసీ కెమెరాలు, గ్రంథాలయ ఏర్పాటు చేయాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య, గుర్రం అశోక్, బుస్స సంపత్, చెన్నబోయిన అజయ్, బొమ్మకంటి రాజేందర్, ఎండపెల్లి కరుణాకర్‌రెడ్డి, చింతం రాజేందర్, ఒంటేల కరుణాకర్, బొమ్మకంటి శ్రీకాంత్, రాజేందర్, చిలుక గోపి, బొట్ల రాజు, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శన

21 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన

నయీంనగర్, అక్టోబర్11: హనుమకొండలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 21 వరకు రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహించనున్నట్లు వరంగల్ చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు తెలిపారు. చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయంతోపాటు నిరంతరం పని, జీవనోపాధి కల్పించడానికి ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో తమ ఉత్పత్తులను విక్రయించుకోవడానికి ఎలాంటి రుసుము చెల్లించనవసరం లేదని తెలిపారు. ఉచిత విద్యుత్, వస్త్ర ఉత్పత్తులకు ఉచిత బీమా సౌకర్యం, ఉచిత వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో తెలంగాణ, ఏపీ, వెస్ట్ బెంగాల్, ఉత్తరప్రదేశ్, కశ్మీర్, మధ్యప్రదేశ్‌తో పాటు అనేక రాష్ట్రాల నుంచి విక్రయదారులు పాల్గొంటున్నారని, ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవస